సుప్రభాతం

పద్య కవితా సంపుటి

రచయిత

అష్టావధాని

నేమాని రామజోగి సన్యాసి రావు

అంకితము

సకల రస ప్రపూర్ణమును సజ్జన వందిత లక్షణాఢ్యమున్
సుకృత మహాఫలమ్మును విశుద్ధ మనోగత భావయుక్తమున్
త్రికరణ శుద్ధి నంకితము సేనొనరింతు మదీయ కావ్యక
న్యకనిదె సుప్రభాతమును సాంబసదాశివ సేవనార్థమై

--:000:--

ఓ కవితా మనోహర సముజ్జ్వల రూప విలాసినీ! రసో
త్సేక తరంగిణీ! రుచిర దివ్య సువర్ణ విభూషణాన్వితా!
నీ కమనీయ భావమయ నిర్మల తత్వమునే దలంతు సు
శ్లోక జనస్తుతా! జనని! శుద్ధ కవిత్వ సమృద్ధి నీయవే

విషయ సూచిక

1. అంజలి
2. సుప్రభాతం
3. నా భూమి
4. నాదసోపానం
5. వానవిల్లు
6. గోదావరి
7. గోస్తని
8. సందేశం
9. దీపావళి
10. జ్యోతి
11. అక్షరం
12. ఎందుకీ భోగి మంటలు?
13. ఉడుత
14. రాజహంస
15. త్రాసు
16. వృద్ధాశ్రమము
17. మాయాప్రలోభం
18. యతి – నుతి
19. ఆర్తి
20. గురివింద
21. ఊసరవెల్లి
22. చిమ్మెట
23. శాంతి
24. ప్రతిభ
25. తాజమహలు
26. సమ్మతము
27. మధ్య తరగతి
28. కృతజ్ఞత

అంజలి

విద్యానంద విలాస భాసుర మతుల్ విఘ్నేశ వాల్మీకి కా
వ్యాద్యస్తోక కవిప్రకాండులు కవిత్వానూన విన్యాసముల్
హృద్యంబైన గతింబొనర్ప రసవద్దేలాభిరామంబుగా
ప్రద్యోతంబగు కొల్వునందలరు గీర్వాణిం బ్రశంసించెదన్

ఇమ్మహి జన్మనిచ్చి నను సెంతయు ప్రేముడి పెద్దజేసి జ్ఞా
నమ్మును పెంపుజేసి సుగుణమ్ములతో నలరారజేసి ప
ద్యమ్ముల తొల్లి నేర్పి మనసారగ నా అభివృద్ధి కోరు మా
అమ్మను అన్నపూర్ణను సమంచిత సద్గుణరాశి మ్రొక్కెదన్

విమలాంతఃకరణాభిరాముడు మహా విజ్ఞాన తేజస్వి స
త్యమునున్ ధర్మము నాచరించి పరమార్థ ప్రాప్తితో సత్యధా
మమునున్ జేరెను సోమయాజు లనగా మా తండ్రి తచ్ఛీలమే
మము సంరక్షణ చేయు నాతనికి ప్రేమన్ గూర్తు శ్రద్ధాంజలిన్

పాఠశాలలోన పద్యాల నల్లెడు
వేళ నన్ను సత్కవీ! యటంచు
సదయ గనిన పప్పు చంద్రశేఖర గురు
నాత్మలోన దలచి యంజలింతు

కవితా మానస రాజహంస బుధలోక స్తుత్య పాండిత్య పై
భవ రత్నాకరుడున్ వధాన రచనా ప్రజ్ఞా నిధానంబు నాన్
భువి ప్రఖ్యాతిని గన్న మద్గురుని రావూర్ వేంకటేశ్వర్లు సం
స్తవనీయామల సత్త్వశీలు గొలుతున్ సౌవర్ణ పుష్పాంజలిన్

అక్షర తత్త్వమ్ము అఖిలకళాఢ్యమ్ము
          అధ్యాత్మనిరత సమాశ్రయమ్ము
బాల భాస్కర కోటి భవ్య ప్రభాకర
          మజ్ఞాన ఘన తిమిరాంతకమ్ము
ఆనంద వర్ధక మస్తోక చైతన్య
          తేజోనిధాన విభ్రాజితమ్ము
అమిత కృపామయ మాశ్రిత రక్షక
          ప్రఖ్యాత చరితమ్ము పావనమ్ము
ఆది మధ్యాంత రహితమ్ము నవ్యయమ్ము
సకల సంసార తాపోపశమనకరము
నైన అద్భుత మిథునమ్ము నద్వయమును
ధ్యానమొనరింతు హృదయ పద్మమ్మునందు

శ్రీమదినాన్వయ క్షీరసాగర చంద్ర!
ధారుణిజా హృచ్చకోర చంద్ర!
వాయునందన ముఖ్య భక్త తారా చంద్ర!
అమృతాశన సమూహ కుముద చంద్ర!
రామ నామామృత రసిక శారద చంద్ర!
సంసార తాపోపశమన చంద్ర!
కువలయానంద వైభవ వివర్ధక చంద్ర!
వైరి వీరానీక పద్మ చంద్ర!
రక్షవీవె కృపాచంద్ర! రాజచంద్ర!
నతులొనర్తు యశశ్చంద్ర! జ్ఞానచంద్ర!
విమల గుణ చంద్ర! నిష్కళంక ముఖ చంద్ర!
రామచంద్ర!సర్వ కళాభిరామ చంద్ర!

సత్య సీమ పురమ్ము సౌవర్ణ మణి ఘృణి
మయభావనోన్నతి మందిరమ్ము
వేదవేదాంగాది విద్యాళి రూపమ్ము
జ్ఞాన వైభవము నెమ్మేని తళుకు
శబ్దార్ధ వైచిత్రి సద్భూషణ శ్రేణి
భాషా వితాన మంబరచయమ్ము
సకల కళా విలాసము మందహాసమ్ము
నవరసోన్మేష మానంద హేల
అగు యశోభాసమాన విహంగయాన
అంబురుహ సంభవుని రాణి అమరవాణి
సత్కృపారస వృష్టి ప్రసాద దృష్టి
కాంచి నను బ్రోవుమా తల్లి! కల్పవల్లి!

సరిగమపదనిస స్వర తాళ గతులతో
బంగారు వీణె నిక్వణములీన
సకల వేద పురాణ శాస్త్ర సారమ్ముల
రాజ మరాళమ్ము ప్రస్తుతింప
శుక వంశ తిలకమ్ము జ్యోతిష సాముద్రి
కాదిగోష్టులతో వినోదమొసగ
భ్రమర ప్రతతి మహా పద్మాటవిన్ జొచ్చి
ప్రణవాది నాదాల వ్యాప్తి జేయ
సరస కవితల నలరింప సత్కవితతి
విబుధ బుధ కోటి సాదృతి ప్రియము గూర్ప
చతురమతి గూడి నాద ప్రశస్తి జేయు
భారతీ దేవి విభవమ్ము ప్రస్తుతింతు

సుప్రభాతం

సౌవర్ణాద్భుత కాంతి పుంజములతో సాహిత్య లోకాన స
ద్భావాంబోనిధి జ్ఞాన భాను డలరెన్ భద్రాత్ముడై చిత్త రా
జీవంబుల్ వికసించె సంతసమునన్ చిందెన్ కళా సౌరభ
శ్రీ వైశిష్ట్యము మేలుకొమ్ము శుభమూర్తీ సుప్రభాతంబగున్

పారెన్ జాడ్య ముఖాంధకారములు శోభా దీప్త లోకంబునన్
దూరంబయ్యెను ఘోరపాపతతి ఎంతో పొంగె సద్యోగముల్
జారెన్ గుండెలు పైరి షట్కమునకున్ జాగేల? శుద్ధాశయ
శ్రీ రంజిల్లగ మేలుకొమ్ము శుభమూర్తీ సుప్రభాతంబగున్

ఏదో కూలియొ నాలియో దొరక నీ వెంతేని కష్టించుచున్
ఆదాయమ్మును బట్టి గంజియొ కలో ఆహారమై దక్కగా
మోదంబందుచు ప్రొద్దులన్ గడిపెదో ఓ యన్నరో! ఓపికే
లేదా? కూలికి బోవలెమ్ము! శుభమూర్తీ సుప్రభాతంబగున్

ఎన్నో రీతుల కష్ట నష్టములతో నీ నేల పండించి నీ
వన్నంబున్ సమకూర్చుచుందువు జనాహ్లాదంబుగా నీకు నో
యన్నా! హాలిక! కూర్చు మోదమదె లేవయ్యా! మహిన్ దున్నగా
తెన్నుండన్ దగదింక లెమ్ము శుభమూర్తీ సుప్రభాతంబగున్

అతి కష్టంబని, సాగలేననక, నీ వత్యాదృతిన్ సేవలన్
బతికిన్ జేయుచు, బిడ్డలన్ బెనుచుచున్ పాకంబునున్ జేయుచున్
ధృతి నుద్యోగము చేయ నేగదవొ? చెల్లీ! ధన్య వీవింక, కీ
రితి నీదే జుమి మేలుకొమ్ము శుభమూర్తీ సుప్రభాతంబగున్

నా భూమి

శ్రీమంతంబు పవిత్ర పర్వత నదీ సింధ్వన్వితంబున్ సుధీ
ధామంబున్ నిగమాగమ ప్రథిత విద్యాభాసురంబున్ బుధా
రామంబున్ ధన ధాన్య సర్వ విభవ ప్రాశస్త్యమౌ భారత
క్ష్మా మాహాత్మ్యము సత్య వర్ధితము విశ్వస్తుత్య మశ్రాంతమున్

అంతటి కీర్తి వచ్చె భరతాంబకు శిష్ట గుణ ప్రశస్తిమత్
సంతతి చేత నా ప్రజల సచ్చరితంబుల దెల్ప బూనుటే
ఎంతయు భాగ్యమంచు మదిసెంచితి బూనితి నీ కలమ్ము మత్
స్వాంతము నందు నిల్చి తగు సాయము కూర్చుత తత్ప్రశస్తియే

భరతుడు సద్గుణాకరుడు పావన రాజ కులోద్భవుండు భూ
భరము వహింప నొల్లక తపమ్ము నొనర్చి యనేక వర్షముల్
పరమ పదమ్మె లక్ష్యమను భావనతో అవధూత యయ్యె న
ప్పరమ తపస్వి పేర మన భారత దేశము గాంచె నున్నతుల్

శ్రీరఘు భూవరుండు గుణశేవధి సర్వ సమర్థ మూర్తియై
ధారుణినేలి కీర్తిగనె తత్కుల వర్ధకు లెందరెందరో
భూరి పరాక్రమాన్వితులు పుణ్యచరిత్రులు ధర్మ మూర్తులా
సార యశఃప్రశస్తి విలసన్మతి వర్ధిల జేసిరెంతయున్

రామచంద్రుడు ధర్మరూపుడు రాజవంశ సుధాంశుడున్
భూమిజా హృదయాభిరాముడు భూరి శౌర్య ధనాఢ్యుడున్
భూమి నేలెను ధర్మదేవత పుష్టి తుష్టియు నొంద శ్రీ
రామ రాజ్యము ఖ్యాతి గాంచె ధరాస్థలిన్ చిరకాలమున్

సత్య వాక్పాలకుడు హరిశ్చంద్ర నృపతి
దేవగణ మునిబృంద వందిత చరితుడు
కష్ట నష్టాల కోర్చుచు కలత పడక
కీరితి వెలింగె నాచంద్రతారకముగ

కాలు గెల్చి సావిత్రి సాధ్వీ లలామ
పతి పునర్జీవితు నొనర్చి పడసె కీర్తి
సుమతి పతి ప్రాణమును నిల్ప సూర్యునిలిపె
ఇటుల మహిమాన్వితలు కలరెందరేని

భారత వంశ వర్ధకులు పాండుతనూజులు ధర్మ రాణ్ముఖుల్
భూరిగుణాఢ్యులున్ పరమ పుణ్యచరిత్రులు శౌర్య ధైర్య వి

స్ఫారులు కృష్ణనండగని వైరుల గెల్చి ప్రశస్త కీర్తులై
ధారుణి నేలి రెల్లరకు తద్దయు సౌఖ్యము కల్గజేయుచున్

మ్లేఛ్చులు భరతావనిని పాలించుచుండ
వారికెంతయు ప్రక్కలో బల్లెమగుచు
బల పరాక్రమ శాలి శివాజినేత
మాతృభూమిని సేవించి ఖ్యాతి గాంచె

స్త్రీలోకమ్మునకే శిరోమణిగ ఝాన్సీ లక్ష్మి ధీయుక్తులన్
కాలావేశముతో మహారణమునన్ ఖడ్గంబు చేబూని క
ల్లోలాభీలమొనర్చి విక్రమము సంరూఢింప నాంగ్లేయులన్
ద్రోలన్ బూని వెలుంగజేసె వనితాలోక ప్రతాపోన్నతుల్

స్థిరమతి సత్యమేవ జయతే యను సూక్తిని విశ్వసించి నా
వరతము సత్యనిష్ఠుడయి వర్తిలి గాంధి బ్రిటిష్ ప్రభుత్వ పుం
దొరలను దేశమున్ విడువ ద్రోలెను భారత మాతృ భూమికిన్
పరమ సుఖమ్ము కూర్చె చిరబంధములన్ విడిపించి యుక్తిపై

ఎందరొ దేశ భక్తవరు లెందరొ శౌర్య పరాక్రమాన్వితుల్
ఎందరొ ధర్మ రక్షకులు సెందరొ శాంతి సమత్వ భూషణుల్
ఎందరొ జ్ఞాన శోభితులు సెందరొ యోగివరేణ్యులైన వా
రందరి ప్రస్తుతింతు భరతాంబ సుతాగ్రణులన్ సుధీంద్రులన్

నాదసోపానము

ధ్యాన సంలగ్న మామక దహర సీమ
పరమ పావన నాదమేర్పడియు నొకటి
మరల మరలను మెదలుచు మరువలేని
నిరతిశయ పరమానంద గరిమ గూర్చె

అజుని ముఖ పద్మములనుండి అనవరతము
వెల్వడుచు ఋక్ ప్రముఖ చతుర్వేదములన
జ్ఞాన విజ్ఞాన పరమ నిధాన రూప
సర్వ సౌభాగ్యకర నాద పర్వమేమొ?

సరస సంగీత సౌవర్ణ సౌధ వీధి
భారతీదేవి మృదుపాణి పల్లవముల
నినుచు వీణానినాద సంజనిత మహిత
మధురనాద తరంగ సంభావ్యమేమొ?

సరస సాహిత్య సుమవనాంతరములందు
అక్షరామర తరుశాఖలందు జెలగు
సుకవి పికరాజ కృతరస స్ఫురదమోఘ
గీతికా రూప కావ్య విభూతి యేమొ?

సుకవి రాజుల కవిరాజు శుభకరుండు
సాదరమ్మున వాగర్థ సారరూపు
లైన జననీ జనకుల ప్రేమానురాగ
సిద్ధి నొందిన కవితా విశేషమేమొ?

భక్త జన మానసారామ భవ్య సీమ
భక్తి తరు శాఖలం దాటపాటలందు
పరవశుండగు నంద గోపాల బాలు
మధుర మురళీ నినాద సంపన్నమేమొ?

ఆ నాదమ్ము మహాద్భుతమ్ము శ్రుతి సూక్తానంద సంధాయక
జ్ఞానోన్మేష విలాసితమ్ము మహదోంకారాది పంచాక్షరీ
శ్రీనిష్పాదితమై మదీయ హృదయ క్షేత్రాన మార్మ్రోగ తత్
ధ్యానాభ్యాస పరాయణుండనగుచున్ దర్శింతు నధ్యాత్మమున్

వానవిల్లు

అన్న ఏమది ఆకసమ్మున అన్ని రంగుల వింతగా
కన్ను విందగు వానవిల్లులు కాంచుమచ్చట రెండుగా
ఎన్ని రంగులు వాటిలో గల పేడు సేడు క్రమమ్ముగా
ఉన్నవందలి యద్భుతంబుల నొప్పుగ వివరింపుగా!

వాన పెలియగ మబ్బుల పట్టు సడలి
సూర్యదేవుని కిరణాల శోభ హెచ్చి
ఏడు రంగులలో కంటికింపు గొలుపు
వాన విల్లాకసమ్మున కానవచ్చు

వర్ష జల బిందువులలోన పడుచునుండు
స్వచ్ఛమగు కాంతి కిరణమ్ము లద్భుతముగ
వర్ణ విశ్లేషణము జెంది వన్నె వన్నె
లీను హరివిల్లుగా ఆకసాన జెలగు

దినకరున కభిముఖమైన దిక్కునందు
దూర తీరాల గొప్ప సేతువును బోలి
కానవచ్చెడు రంగుల వానవిల్లు
చూచు వారల హృదయాలు దోచుకొనును

ఇంద్రుడెన్నడు పూసెనో? ఏమి విల్లు
పూసెనో? గుణమేదియొ, ముల్కి యేదొ?
ఎరుక పడదయ్యు నద్దిర ఇంద్ర ధనువు
సకలభువనాలలోన ప్రశస్తి నొందె

సుకవి మనమను గాజు పట్టకమునందు
భావమను కాంతి కిరణమ్ము పడిన యెడల
వివిధ రసమయ రమ్య కవిత్వ తత్వ
సార సౌవర్ణ శోభాప్రసార మగును

అంబరేశుడు వాహ్యాళి కరుగు వేళ
సప్తవర్ణ కలిత మహాచ్ఛత్రమతని
వెనుక పరిచారకులు పట్టుకొనెడి సరణి
కాన వచ్చును చక్కని వానవిల్లు

సప్త వర్ణాల తురగాల స్యందనమున
సంచరించుచునుండు భాస్కరుడు జగతి
ఆ తురంగాల రంగులే హంగుమీరు

వానవిల్లుగ నట కాన వచ్చునేమొ?

స్వచ్ఛమగు నంతరంగ భావనలునేని
మాయలన్ ప్రసరించుచో మలినమగుచు
విషయ సౌఖ్యాలు గోరుచు పెర్రియగుట
కద్దు కావున తగిన జాగ్రత్త వలయు

ఆది నారాయణుని నిర్మలాంశువులును
శీకర స్పర్శ వర్ణ వైచిత్రి నొందు
చుండ సామాన్య జీవుల గుండియలును
రంగు మారుటలో అబ్బురంబు గలదె?

వివిధ వర్ణమ్ములును వానవిల్లునందు
సామరస్యమ్ముతో నొప్పు చంద మకట
సకల మతములు బోధించు సారమొకటె
శాంతియుత సహజీవన సరణి యనుట

క్రమముగా రంగులన్ని చక్రమున పేర్చి
త్రిప్పుచో కానవచ్చును తెల్లదనమె
అటులె ఏ మత మార్గములైన గాని
సత్యపదమునకే జేర్చు సాధకులను

గోదావరి

గౌతమ మునివర్యు ఘన తపః ఫలముగా
ఆవిర్భవించిన అమలతటిని
త్ర్యంబక గిరినుండి అబ్ధిదాక అనేక
తీర్థాల సెలపైన దివ్య గంగ
సాదరమ్మున జనుల్ స్నానమ్ము గావింప
సత్ఫలమ్ముల నిచ్చు చారువేణి
ముక్కాలముల పంట భూముల నలరించి
కామితమ్ముల నిచ్చు కల్పవల్లి
వేద ఘోషల తోడ వేవేగ సాగి
వాహినీనాథు జేరెడు ప్రణయరూప
పుణ్య గోదావరీ నదీ ధన్య చరిత
వైభవమ్ములు చిరకాల శోభనములు

గోస్తనీ

శ్రీమంతమగు నాంధ్ర భూమండలమునకు
ఉత్తరాగ్రంబున నొప్పుచుండు
దండకారణ్య సన్మండిత పర్వత
పంక్తులందున సముద్భవము నొంది
అంతఃప్రవాహినియై బహు యోజన
ప్రాంతాల దాటి పైపైకి చేరి
క్ష్మాతలంబున బహు శాఖోప శాఖల
మధురాంబుసార సంభరిత యగుచు
సారవంతమొనర్చి కేదారములను
తీర దేశ ప్రతిష్ఠిత దేవతాళి
సెల్ల సేవించి జని సంగమించి కడలి
గోస్తనీ నది భవ్య ప్రశస్తి గాంచె

సందేశం

విద్యయు వినయమ్ము విజ్ఞానముల గూర్చి
చింతించు కాలమ్ము చెల్లె నంచు
సంస్కృతీ విభవమ్ము సత్సంప్రదాయమ్ము
కాలమ్ముతో నడుగంటెనంచు
ధర్మమ్ము న్యాయమ్ము దాక్షిణ్యమ్ములు సేని
అందరాని ఫలమ్ములయ్యె నంచు
సత్యమహింసయుశాంతియు ప్రేమయు
విలువలే లేకుండ నలిగెనంచు
వగవగానేల? నలుగురి బాటలోన
నడువ నేర్చిన దినములు గడుచు ననక
జాతి చైతన్యవంతమై సత్పథాన
తిరిగి నడిపింప జేయుడీ దీక్ష బూని

దీపావళి

దీపావళీ దివ్య దీధితుల్ విశ్వాన
విజ్ఞాన విభవాల విస్తరింప
కామాంధకారమ్ము గర్వాంధకారమ్ము
మోహాంధకారమ్ము మొదలుగాగ
అంధకారములు హాహాకారముల తోడ
త్వరితమ్ము దశ దిశాంతముల కరుగ
సత్యమ్ము, ధర్మమ్ము, శాంత్యహింసలు ధరా
తలమున కాంతిమంతముగ నలర
ప్రజల హృదయాంబుజాలలో ప్రమద సౌర
భము లతిశయింప కళ్యాణ భరితములయి
సత్కళామయమైన విశ్వప్రశస్తి
నలరు దీపావళీ పర్వమా! జయోస్తు

జ్యోతి

అదియొక దివ్వె చీకటుల నంతము చేయుచు వెల్గునింపు అ
య్యది రవిబింబ మీ జగతి యందలి చీకటు లెల్ల బాపు, ఉ
న్నదొ మరియొక్క జ్యోతి భువనమ్ముల వెల్గుల కెల్ల వెల్గునై
మది పరికించి కాంచవలె మాయల కావల నా వెలుంగునే

మనమను గూటిలోన పరిమాణము నందణు మాత్రముండి చే
తనమును గూర్చు నింద్రియ వితానము దీపిల నొక్క జ్యోతి బు
ద్ధిని వికసింప చేయుచును ద్రిప్పును యోగపథమ్ము నందు జే
ర్చును ముదమార జ్యోతులకు జ్యోతిగ భాసిలు జ్యోతి చెంతకున్

అక్షరం

పసుల కాపరులౌచు పసలేని తెరువులో
          పశువుల పశువులై బ్రతుకువారు
కొండ గుట్టలలోన బండరాళ్ళను గొట్టి
          బండల బండలై యుండువారు
తరతరమ్ములనుండి తాకట్టు పెట్టగా
          పెట్టిచాకిరు లందు పేగువారు
కూడు గుడ్డలు గూడు కూలి నాలియు లేక
          కటిక దరిద్రాన కనలువారు
ఎందరెందరో బడుగులు కుందుచుండ
వారి గాఢాంధకార జీవన వనాల
సుమవనమ్ములుగా దీర్చి శోభ గూర్చు
అక్షర జ్యోతులకు సువర్ణాంజ లిడుదు

ఎందుకీ భోగి మంటలు ?

తిండిలేకను మాడి తిప్పలు పడువాని
          యెడ జాలి చూపని కడుపుమంట
అధికార రోష తామ్రాక్ష వీక్షణలహో
          క్రక్కుచుండెడి యహంకార కీల
రాజకీయాలలో ప్రతిపక్ష వర్గాల
          స్పర్ధలు రగిలించు చండ వహ్ని
బడుగు వారల చాల నడుప పీడన చేత
          వెల్వడి వ్యాపించు విప్లవాగ్ని
అంగడుల దినదినమును నింగికెగయు
ధరలనెడు భీకరాగ్నియు ధర్మముడిగి
బహు విధమ్ముల దౌష్ట్యాగ్ని ప్రజ్జ్వరిల్లు
వేళలో భోగిమంట లింకేల నయ్యా?

ఉడుత

శ్రీరఘురామ చంద్రునకు సేవలొనర్చెడు పెద్కతో కపుల్
వారిధి పైన సేతువును బాగుగ కట్టుచునున్న వేళ ఆ
చేరువ నీవు సాయమును చేయుచు నుండవె? భక్తి యుక్తు లౌ
ప్పారగ ధన్యవో ఉడుత! అందుము నాదు జొహారు లాదృతిన్

పని ఎంత బృహత్తరమో
అని ఎంచక చేసితివి సహాయము నుడుతా
ఘన దీక్ష బూని తీరిక
గొనక రఘూద్వహుని యందకుంఠిత భక్తిన్

వానరులు నీ మహోత్సాహ వైఖరి గని
నిన్ను మించిన దీక్షతో సన్నయమున
రేబవళ్ళు శ్రమించి నిర్మించిరంత
జలధిపై సేతువన నేమి సందియమ్ము?

రాముడు నిన్ను గాంచి అనురాగముతో నిను చేరదీసి తత్
కోమల పాణి పద్మముల గోముగ దువ్వుచు పల్కరించి నీ
సేమ మెరింగి సాయమును చేసిన చందము నెంతొ మెచ్చె అ
ట్లోముట భాగ్య వైభవము యోగ వరిష్ఠము భక్త శేఖరా!

పట్టుదల మీర శ్రీరామ పాదములను
నమ్మి పూనిన యట్టి యత్నముల వలన
స్వామి కరుణించు కలిగించు సత్ఫలములు
సంశయము లేదు కనవచ్చు సద్గతులను

నీదు వీపు పైన నిమిరె రాముండన
అలరె వ్రేలి ముద్రలద్భుతముగ
ఉడుత సాయమంచు నుడుత భక్తి యటంచు
నిలిచె శాశ్వతముగ నీదు కీర్తి

ఎవ్వరేనియు పెద్దలకే సహాయ
పడెదరని పరులన బాధపడుట తగదు
స్వామి నీ భక్తికిన్ మెచ్చి శాశ్వతముగ
ప్రేమ ముద్రలు వేసి దీవింప లేదె?

చిన్నదాన వయ్యును మనసున్న దాన
వో ఉడుత! నీ సదాశయ మున్నతి గనె
పరుల కవ్యాజముగ సాయపడెడు వేళ

నిన్ను పేర్కొందు రెల్లరు నిశ్చయముగ

రాజహంస

పాలమించిన తెల్లని వన్నె మేను
మేనిలో నెల్ల ద్విజముల మించు హొయలు
హొయలునకు మించి లలిత గుణోన్నతులును
రాశి జేసిరి నిన్నుగా రాజహంస!

నలువకు వాహనమ్మవట నాలుగు వేదము లారు శాస్త్రముల్
తెలిసిన వాడవంట గణుతింపగ యోగివరేణ్య రాజిలో
నిలిచెద వంట క్షీరమును నీరమునున్ విభజించు నేర్పునున్
గలిగి బుధ ప్రశంసలను గాంచిన హంస కులావతంసమా!

నల దమయంతు లిద్దరి మనమ్ముల ప్రేముడి నాట జేసె నీ
లలిత పద ప్రశస్తి బళిరా చతురోక్తుల నెంత వారి బు
ద్ధులనె జయించు వాడవట స్తుత్య గుణాకర! సద్యశఃస్థితుల్
తెలుపరె నీదు పోలికను ధీపరిపూర్ణ! మరాళ రాజమా!

కాంతలెందరొ నీ పద గతుల గాంచి
ముచ్చటలు నొంది ఒయ్యారముగ నడకలు
నేర్చుకొనెదరు నీకెరు నేర్పినారొ?
సహజమిది నీకు నసమాన చారుయాన!

నిను నుపమింతురు సద్యశ
మునకు గదా నీ యశమ్ము పోలికి జెప్పన్
కనరా దెయ్యదియు జగతి
నినునకు తేజమున సాటి ఏమనవచ్చున్

రంగులన్నియు మాయలన్ ముంచునని రోసి
          తెల్లదనాన రాజిల్లినావు
మాయాజగాలలో మనుగడ లేలంచు
          సత్యలోకమునందె సాగినావు
అన్య మార్గమ్ములు వ్యర్థములని ద్రోసి
          జ్ఞాన మార్గమ్మునే బూనినావు
విద్యా ప్రశస్తిచే విర్రవీగుట మాని
          వినయ సంపదనె భావించినావు
మంచి చెడ్డల తీరు గుర్తించునపుడు
మంచినే గొని చెడు విసర్జించునపుడు
నీదు నేర్పరితనము వర్ణింప తరమె
వేల్పులకునేని పరమ వివేకశాలి!

సృష్టికర్తకు వాహనంబీవె యగుట
అందములనన్ని నీయందె పొందుపరచి
లలిత పదగతులను కూర్చె రాజహంస!
కలుగదే సిరి పెద్దల కొలువులందు?

ఆ మహాదేవ లింగాగ్ర మరయు పేడ్క
తమ్మిచూలియు నీ రూపె దాల్చె నంట
ఉన్నత పదమ్ములకు జేర నుత్సహింప
పరమహంస పదమ్మె సంభావ్యమేమొ?

వృద్ధ సేవలొనర్చు పవిత్ర శీలి
సత్కళా సేవలొనరించు జ్ఞానశాలి
సేవలన్ ధన్యమయ్యె నీ జీవితమ్ము
నిలుచు నాచంద్ర సూర్యమ్ము నీ యశమ్ము

త్రాసు

తమవారి కొకరీతి తక్కోరు కొకరీతి
ఫలితాలు చూపు భావంబు లేక
విలుపైన వస్తుల వెలలేని వస్తుల
వహియింప భేదభావంబు లేక
కొనునట్టి వేళ అమ్మినయట్టి వేళలో
బరువుల భేదభావంబు లేక
ఇది రొక్కమునకు నయ్యది అరువునకను
వర్గాల భేద భావంబు లేక
ఓ తులా! నీవు ధన్యవు యోగి వోలె
పక్షపాతము లేకుండ వ్యాజ్యములకు
నుపకరింతువు సమబుద్ధి యొప్పుచుండు
నీ సమానులు గలరొక్కొ నీతి సరణి

అంగడులలోన క్రయ విక్రయములయందు
నీదు పైఖరి సంస్తవనీయము కద
ధర్మ వర్తన సంతతాదర్శ శీల
పై తనరుచుండు నిన్ను నే నభినుతింతు

మోసమొనరించు చుందురు త్రాసు బూని
వర్తకులు కొందరేమందు వారి గూర్చి
తామరాకుపై నీటి చందాన నీకు
వారి పాపమ్ము లంటెడు బాధ లేదు

కనులు రెంటికి గంతలు కట్టుకొనిన
ధర్మ దేవత భవ్య హస్తమున నిన్ను
పూనుచున్ న్యాయ సమ్మతమైన తీర్పు
నిచ్చెడు విధంబు లెంతేని మెచ్చదగును

నీదు భాగ్యంబు నెటుల వర్ణింప గలను
నాడు శ్రీకృష్ణునే తూచినావు నీవు
లఘిమ గరిమాదులగు సిద్ధులను మురారి
భక్తితో పెల్వరించె నీ వలన కాదె

వివిధ వస్తుల తూచెడు వేళలందు
పెక్కు రూపాలలోన కన్పించుచుండి
విలువలను నిశితంబుగ తెలుపుచుండి
మన్ననల నందుచుంటివో మాన్యచరిత!

రాశులలందున ఏడవ రాశి వగుచు
కవివరుండును సత్కళాకారకుండు
సైన శుక్రున కీవు గేహంబవనగ
అలరు చుండెడి నిన్ను నే నభినుతింతు

వృద్ధాశ్రమము

అదిగొ వృద్ధాశ్రమంబను ఆలయమ్ము
ప్రేమదేవత అందులో విగ్రహమ్ము
శాంతి ఆమె ప్రసాదమ్ము సాదరమున
ఆమె పాదాంబుజంబుల కంజలింతు

సేవ పరమార్థమని విశ్వసించువారు
ప్రేమ దైవాంశ యనుచు భావించువారు
సమతతో తోటివారిని సాకువారు
అందు ఉద్యోగులై సౌఖ్యమంద గలరు

బ్రతుకు బాటలో పెక్కు సంవత్సరాలు
యాత్ర సాగించు చుండి వయస్సు మళ్ళి
చివరి దశలోన విశ్రాంత జీవనమ్ము
నరయువారికి గూడు వృద్ధాశ్రమమ్ము

ఎన్ని సంపదలున్నను ఇంటిలోన
వృద్ధులై జవసత్త్వాలు లేక తమకు
రెక్క సాయమొసగు వారు లేక మిగుల
ఆర్తి గొను వారి కిరవు వృద్ధాశ్రమమ్ము

జీవన విధానములు మారి చివరి దశను
మారిన పరిస్థితుల తోడ మారలేక
సతమతమ్మగుచును మానసమున శాంతి
నరయు వారికి నీడ వృద్ధాశ్రమమ్ము

నా అనెడు వారు లేక అనాథలగుచు
ఎట్టి జీవనోపాధియు నేని లేక
మూడు కాళ్ళతో నెంతేని మూల్గుచుండు
నట్టి వారికి తోడు వృద్ధాశ్రమమ్ము

అంతిమ ఘట్టమందు హృదయమ్మున చీకును చింత లేక వి
శ్రాంతియు సౌఖ్యమున్ గలిగి సంతతమున్ తన తోటి వారితో
సంతసమొప్పగా కలిసి సాగుచునుండెడి సాధు కోటితో
నెంతయు పావనంబగుచు నీ నిలయమ్ము ప్రశస్తి గాంచుతన్

మానవ సేవ నిక్కముగ మాధవ సేవయె అన్న సూక్తినే
మానసమందు నమ్మి పరమంబగు భావన తోడ సజ్జనుల్
పూనుడు వృద్ధ సేవలను పొందుడు మిక్కిలి పారమార్థికం

బైన సుఖమ్ము మీ సుకృతులా భగవంతుని కింపు గొల్పుతన్

నేడు వృద్ధాశ్రమమ్మును నిలిపి మీరు
వీలు కలిగిన రీతి సేవించిరేని
ఒక్క నాటికి అదె మీకు చక్కనైన
వసతియగును వానప్రస్థవాసమందు

మాయా ప్రలోభము

పిల్ల డొక డాడుకొనుచుండ వీధిలోన
తాయము నొసంగి వాని గొంపోయె నొక్క
డసెడు వార్తను జూపి ఇట్లనియె నొక్క
గురువు విద్యార్థులకు నీతి గరపు పేడ్క

వాడొకడె కాదు మాయా ప్రపంచమందు
ఎందరెందరో మోసగాండ్రెన్నొ గతుల
నమ్ము వారల నెల్ల మోసమ్ము జేసి
పెద్దలగుదు రవ్విధము తెల్పెదను వినుడు

మాటలందున నొలికించి మధుర రసము
ప్రేమ రీతుల నమ్మించి కాముకుండు
మానమును దోచి పెనుపెంట మాటమార్చి
మానినుల జీవితమ్ముల మంట గలుపు

ఒకడు నమ్మించుచుండి యుద్యోగములను
కూర్చెదనటంచు కాసులు గుంజుకొనును
అటుల మోసము నొందిన యట్టి వాన్కి
అకట ఉద్యోగమా లేదు అప్పు మిగులు

ఎరను గాలమ్ముతో పేసి చెరువునందు
పేచి పేటాడు చేపల పేటగాడు
దొంగ జపము నటించెడు కొంగ వోలె
నక్కి గోతుల త్రవ్వెడు నక్క వోలె

మంచి చిత్రాలలోన నటించవచ్చు
రమ్ము నా తోడనని పల్కి నమ్మకముగ
పట్టణములకు గొంపోయి పడుపుటిండ్ల
కమ్మెదరు యువతులను మోసమ్ము సుమ్ము

పిల్ల చేపల కబళించు పేడ్కలోన
చిక్కు గాలమ్ములకు పెద్ద చేపలేని
అటుల సాధుల వంచించు యత్నమందు
పడెద రిక్కట్టు లెంతటి వారలేని

కప్ప యొకటి కీటకమ్మును కబళింప
చాపు నాల్క గాని సర్పమొకటి
తనను మ్రింగుచుండెనని తలపోయదు

బళిర మోసగాండ్ర బ్రతుకులిట్లె

ఉదర పోషణ భారార్తి నొక్కరుండు
అధిక విత్తార్జనాసక్తి నన్యుడొకడు
అతి వినోద ప్రవృత్తిగా అధముడొకడు
మోసముల జేసి నాశమ్ము పొందుచుండు

బూటకమే ప్రవృత్తి కడు మోసము చేయుచునుండు నొక్కడే
పాటును చేయనొల్లడదె పాటవమంచు దలంచి పొంగు నీ
నాటకమెల్ల చెల్ల నొక నాటికి తానె మునుంగు చిక్కులన్
తాటిని తన్నువాని తలదన్నెడు వాడొకడుండు సెల్లెడన్

పంచ విషయాల సెరల గావించి మాయ
ఇంద్రియమ్ముల నూరించి ఎదల దోచి
జీవితమ్ములు వ్యర్థమ్ము చేయుచుండు
నణగుచుందురు మాయలో నజ్ఞులిట్లు

శబ్దమునకు మృగమ్ము స్పర్శకు గజమ్ము
రూపమునకు పతంగమ్ము రుచికి చేప
వాసనకు జిక్కు భృంగంబు మోసపోయి
మనుజు డైదింటి వలన నాశనము గాంచు

కలియుగమిద్ది చెల్లినది కాలము మంచికి పాప పుణ్యముల్
తలపరు సత్య ధర్మములు తద్దయు నుక్కిని బాసె, ఆస వి
చ్చలవిడి విర్రవీగుచును స్వైరవిహారము చేయుచుండగా
నిలువగ సజ్జనావళికి నీడయు లేదిక నేమి చెప్పుదున్

ఉండవు ప్రొద్దులన్నియును నొక్క విధమ్మున కొన్ని నాళ్ళకున్
పండును పాపముల్ ధరణి భారము ద్రుంచుచు దుష్టకోటికిన్
దండన గూర్చి సాధువుల తద్దయు బ్రోచుచు ధర్మమెల్లెడన్
మెండుగ నొప్పజేసి భువి మేలొనరించును దైవమెంతయున్

మంచికి మారు పేరనెడు మాన్యులు మున్నె గతించి రెన్నడో
వంచన చేతనే బ్రతుకు పబ్బమొనర్చెడు వారు హెచ్చుటన్
కంచెను చేను మేయు కలికాల మహత్వముగా దలంతు నీ
కంచెల గాధ చేర్చవలె కంచికి మంచిని పెంచగావలెన్

ఎట్టి ఎరల గిరలనేని ఆసించక
ఆత్ర పడక కాస్త ఆచి తూచి
అడుగు పేయుచుండి ఆ మాయలను దాటి

భద్రములను జనులు బడయవచ్చు

యతి నుతి

వారిజాంబక సతీ వాత్సల్య వైభవ
          కలితుండు కవులందు కవివరుండు
వాగ్దేవి నర్తించు వదనాంబుజము వాడు
          బ్రహ్మ విద్యా ప్రభాభాసితుండు
సజల మేఘశ్యామ సద్వర్ణగాత్రుండు
          పరమ కృపారసాస్పద పదుండు
ఘన జటాగౌరవ కలితోత్తమాంగుండు
          భాగీరథీ పయః పావనుండు
ధరణి నజ్ఞాన తిమిర మార్తాండ మూర్తి
లలిత దరహాస చంద్రికా రాజితుండు
ప్రధిత ముక్తివి పీఠాధిపతి శుభమతి
లక్ష్మణ యతీంద్రుడాతని ప్రస్తుతింతు

ఆర్తి

ఔరా! రక్కసి మూకల
ఘోరాలకు హద్దులేదు గుండెలలో బే
జారయ్యె స్త్రీలను నడి బ
జారుల వేధించు దుష్ట సరణుల్ వింటే

కలరు దుశ్శాసనుల సింధవులను మించు
ఘోర దురితాంధకార ప్రపూరమతులు
అకట దౌష్ట్యాగ్ని కీలల కాహుతియగు
చుండు నబలల తలచుచో గుండె కరగు

స్వార్థపరుల కబంధ హస్తాల వలన
చండ శాసన రాజస జ్వాల వలన
ధర్మ దేవతకేని భద్రత హుళక్కి
యగుట సామాన్యుల విధమ్ము లడుగనేల?

కట్నమను పిశాచత్వమ్ము కాల్చుచుండ
వికృత కామాగ్ని కీలలు ప్రేల్చుచుండ
కుటిల తామస కృత్యాలు కూల్చుచుండ
భరత సంస్కృతి పడుచుండె నరక బాధ

తలచిననే భయమ్మగు విధమ్ముల నైక కరాళ నృత్యముల్
సలిపెడు దుష్ట శక్తులను చయ్యన నంతమొనర్చి ధర్మమున్
నిలుపుచు, భద్రతన్ గొలిపి, నీతికి పట్టము గట్టరే? మహా
త్ములు మరలన్ ధరిత్రి పరితోష సుఖమ్ములు నిండునట్లుగా

గురివింద

గురివిందా! నీవే నలు
గురి విందవు, చాయలోన గుణములలోనన్
కరమరుదగు నీకుంగల
సిరులు గదా, నీ ప్రశస్తి స్థిరమై నిలుచున్

ఎంతొ ఆకర్షణీయమౌ ఎరుపు వన్నె
కనుల పండు వెల్లరకును కలుగజేయు
కాన దృష్టి దోషమ్ములు కలుగ కుండ
నలువ నీకిచ్చె చక్కని నల్లమచ్చ

పదవిలో నీకు సాటియౌ పసిడి యొకటె
తూచరట నిన్ను వేరె వస్తువుల కొరకు
నీదు జాతిలో సమతౌల్య నిరతి కదియె
పారితోషిక మౌసె జోహారు నీకు

మంచి మనసున్న వారి గురించి పరులు
ఓర్వలేకనె నింద వేయుట సహజము
నిన్ను నేనియు జనులు నిందించుచుందు
రయ్యు లెక్క జేయని నిన్ను నభినుతింతు

ఊసరవెల్లి

విర్రవీగుట లేలనో? బుర్ర నెత్తి
నిక్కి జూచుచు మదముతో టక్కరీడ!
వెలుగులంజేరు ఊసరవెల్లి! చాలు
రంగులను మార్చు నీదు తెరంగులెల్ల

అవకాశమును బట్టి మార్చెదవు రంగౌనౌను నీ విద్య సం
స్తవనీయంబట రాజకీయముల ప్రస్తావించగా నాయకుల్
భువి నీ పద్ధతులెల్ల నేర్చిరి బళా! మూణ్ణాళ్ళ ముచ్చట్లుగా
అవలంబింతురు క్రొత్త మార్గములనే స్వార్థమ్ము లక్ష్యమ్ముగా

మనుగడ ముఖ్యమంచు అభిమానముతో పనిలేదు కోరి వ
చ్చిన పద విత్త యోగముల ఛీయని రోయుట వెర్రియంచు నె
మ్మనమున నమ్మి నీతులను మన్నన సేయక పూడ్చి పెట్టి క్ర
న్నన దిగజారు చుందురట నాయకులెందరొ ఏమి చెప్పుదున్

ఎన్నికముందు పల్కగల రెన్నియొ నీతులు నీటిమూటలై
అన్నియు కారిపోవునెడ అక్కట ఎప్పటి యట్ల నాసతో
పెన్నిధు లెన్నొ రీతులుగ బెంచుచు సంఘము మాటనెత్తకే
కన్నును మిన్ను గానని వికారము తోడ చరింతురెంతయున్

నాయకులలోన కొందరమాయకులును
నీతిమంతులు కల్గుట చేత నేడు
దేశమొక కొంత బాగున్న తెరగు దోచు
మెరగు పడవలె నీ తీరు త్వరితగతుల

చిమ్మెట

ఒక్క విలుపైన పొత్తమ్ము నొక్కనాడు
తెరచి నే జూడ చిమ్మెట పురుగొకండు
అందు కన్పట్టి పరుగున నరిగి దాగె
మరల నప్పొత్త మందొక్క మారుమూల

చిమ్మెట నే గనుంగొనుడు చిత్తము మెండు కలంగె నెట్టి పొ
త్తమ్మునకేని పుర్వులివి తప్పవె దైవమ యంచు తీవ్ర దుః
ఖమ్మున తాపమొందుచును కన్నుల నశ్రులు జాలువార డెం
దమ్మున గోచరించె కవితా లలితాంగి ప్రసన్నమూర్తియై

ఆ లలితాంగి నా కనుల నశ్రు కణమ్ముల నొత్తి ఎంతయున్
జాలిగ జూచుచున్ బలికె సత్కవివర్య! విచార మొందగా
నేల ప్రపంచ రీతులివి యింతియె చిమ్మెట మాటకేల? ఇ
క్కాలమునందు స్వార్థమయ కల్మష చిత్తుల తీరెరుంగవే?

మానవులందున కొందరు
జ్ఞానము కలవారలయ్యు కలిగింపరొకో?
హానిన్ బరులకు నూరకె
ఆ నీచుల విడిచి అలుగుటా? చిమ్మెటపై

మెరయును గాని వెండివలె మేను విచక్షణ యన్న సున్నయే
మెరిసెడు వస్తులెల్లయును మేలిమి బంగరు కావనంగ నీ
పురువులె సక్షి పొత్తముల భుక్తియె ముఖ్యము గాని లోని అ
క్షర రమణీయ సరమయ సంగ్రహ ముఖ్యము లెక్క చేయునే?

ఇందు గలవంచు లేవంచు నందులోన
సందియంబేల కన్పించు నెందునేని
పలురకమ్ముల చీడలు పట్టి పీల్చి
సార హీనమ్మొనర్చు దేశాలనేని

నీతికి సమాధి కట్టుచు
కోతలతో ప్రొద్దు పుచ్చి కొండెమ్ములతో
గోతులు తీయుటతో పలు
రీతుల పెక్కండ్రు వెలుగరే నేడిలలో?

భారతిజాతి పూర్వ జనవంద్య సముజ్జ్వల సంప్రదాయ సం
స్కారములున్ గృశించినవి సభ్య సమాజములోన దూరి సం

స్కార విహీన ముష్కర నికాయమె పెద్దతనమ్ము గైకొనెన్
మారెను ధర్మమున్ చెదలు మంటలనే అణగార్చె నక్కటా!

శాంతి

తలపుల పలుకుల కర్మం
బులను పవిత్రతయు సత్యమును ధర్మంబున్
చెలగదగు సెల్ల వేళల
సలలితగతి యోగ సిద్ధి శాంతిన్ బడయన్

వృక్షాలు కీటకాల్ పక్షులు జంతువు
  లన్నింటిలో నుండు నత్మ యొకటె
బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదుల
  అందరిలోనుండు నాత్మ యొకటె
యోగులు రాగులు భోగులు రోగులు
  అందరిలోనుండు నాత్మ యొకటె
మన్మధాకారులు మలిన వికారులు
  నందరిలోనుండు నాత్మ యొకటె
భేద భావమ్ము వలదంచు ప్రేమ మీర
అందరను సమబుద్ధితో నాదరించి
సేవలొనరించు నాదర్శ జీవి గాంచు
పరమ శాంతిని సుస్థిర ప్రజ్ఞ వెలుగ

అంచ జలమ్ములన్ విడిచి అచ్చపు పాలనె గ్రోలురీతి వ
ర్తించుచు జీవితమ్ములను ప్రేముడి వెల్గగ సెల్ల వేళలన్
మంచిని మాత్రమే గొనుచు మాయలలో బడకుండ భ్రాంతులన్
ద్రుంచుచు తుచ్ఛ సౌఖ్యముల రోయుచు శాశ్వత శాంతి గాంచుడీ

పంచ భూతములును పంచ తన్మాత్రల
కారణములు దుఃఖ తోరణములు
కోరికలను రేపి కూల్చును మాయలో
వాటికావల గనవచ్చు శాంతి

మాయ వలన సృష్టి, మాయచే పాలన
మాయలోన లయము మరల మరల
వచ్చు మాయదాటి పయనించ చైతన్య
పథమునన్ లభించు పరమ శాంతి

ప్రతిభ

సకల విద్యా విశారద చారు కీర్తి
భాసురులు కలరెందరో భరత భూమి
వారి ప్రతిభా వికాస శోభాప్రదీప్తి
మహి నలరుచుండు మకుటాయమాన మగుచు

వర్గ కుల మత భేదాల వలన నిచట
బడుగు వారల నుద్ధరింపగ ననేక
గతుల ప్రోత్సాహముల నిచ్చు కారణముల
ప్రతిభకు లభింప దయ్యెను వలయు ప్రాపు

ఈ నిరుద్యోగ సంక్లిష్ట మైన సీమ
ప్రతిభ గలవారికి తగిన పదవి లేక
ఆదరణ లేక చీకాకు లందుచుండి
గడుపు చుందురు కాలమే గతియు లేక

ఇతర దేశాల ప్రోత్సాహ మెంతొ గనుచు
నేగుచుండి రనేకులు నిల్లు విడిచి
వలస పోవుచు నున్నది ప్రతిభ అకట!
ఇట్టి నష్టము తలపోయదేమొ ప్రభుత

కలత పడువారి పలుకుల విలువ లేక
విలువ గలవారి మనసుల తలపురాక
తల్లడిల్లెడు ప్రతిభ నోదార్చుటెపుడొ?
ఈ స్థితుల నెల్ల దిద్దుట యేని యెపుడొ?

తాజమహలు

శ్రీమత్ సూర్య సుతా ప్రశస్త తటినీ స్నిగ్ధాంచలస్థాద్భుతా
రామ ప్రాంత వినిర్మిత ప్రథిత హర్మ్యశ్రేష్ఠమై షాజహాన్
భూమీపాలక హృత్సరోజ విలసన్ముంతాజ్ వధూ సంతత
ప్రేమోత్సేక పవిత్ర చిహ్నవరమై పెల్గొందహో తాజ్మహల్

అలరారున్ శశికాంత సుందర శిలా హర్మ్య ప్రశస్తంబు, ని
స్తుల సౌందర్య విలాసమై ధగ ధగచ్ఛోభాప్రకీర్ణంబునై
విలసద్వాస్తు కళా ప్రభావిభవమై విశ్వాద్భుతశ్రేణికిన్
తిలకంబై భువి తాజ్మహల్ మహిత దీప్తిన్ నేత్ర పర్వంబునై

సమ చతుర్భుజాకార విశాలవేది
పైని అష్టభుజాకార వైభవాన
సముచితోన్నత సౌధ ప్రశస్తమనగ
తనరు నాగ్రా పురమ్మున తాజమహలు

అందు భూగర్భ నిర్మిత మందిరాన
కలవు ముంతాజ్ షాజహాన్ కవ సమాధు
లమల ప్రేమానురాగ భావాభిరామ
మహిత మణి దీప మాలికామయము లగుచు

మూడు ప్రక్కల ద్వారాలు ముచ్చటైన
కట్టడమ్ములలో ఠీవి ఉట్టిపడును
వెనుక భాగాన యమునా పవిత్ర తటిని
మృదుల నాదమ్ము మోదమ్ము సెదల నింపు

ఆ యమునానదీ ప్రవిమలాంబువులా భవనావతంసమున్
పాయని సఖ్య భావ విభవమ్మున సెమ్మది నాశ్రయించుచున్
తీయని భావ వైఖరులు దీపిలు రాగము లాలపించుచున్
హాయిని గూర్చుచుండు మృదులాంచిత వీచికలన్ స్పృశించుచున్

ప్రకృతి పులకింప జేయునా పరిసరాల
బహుళ చిత్ర విచిత్ర పుష్ప ఫలభరిత
రమ్య తరు గుల్మ వల్లికా రాజి నలరు
అద్భుత వినోద లీలావిహార వనులు

పరిసర పుష్ప వాటికల వర్తిలి మారుతముల్ సుగంధ సం
భరిత తరంగ మాలికల భవ్యమనమ్మున సత్కరించుచున్
కరము ముదమ్ము నొందు శశికాంత శిలామయ సౌధరాజ సుం

దరతర మందిరమ్ముల సదా విహరించుచు సఖ్య రీతులన్

శారద చంద్రికా ధవళ సార విభాసిత కాంతి పుంజ వి
స్తార సమన్వితంబులగు తాజ్మహలద్భుత దీప్తులాయెడన్
జేరిన ప్రేయసీ ప్రియుల చిత్తములన్ గిలిగింత పెట్టుచున్
చేరువలో నికుంజముల చేర్చు మనోజ విలాస రీతులన్

అచ్చట నొప్పుచుండును విహంగము లెన్నియొ ఆటపాటలన్
ముచ్చట గొల్పుచున్ వివిధ భూరుహ శాఖల నాశ్రయించుచున్
నిచ్చలు కర్ణపేయముగ నిస్తుల రాగము లాలపించుచున్
మచ్చిక చూపు చూపరుల మానసముల్ పెలుచొంద జేయుచున్

కనువిందై యలరారు తాజమహ లాగ్రా పత్తనంబందు ర
మ్యనదీ తీరము నందు కాంచితిని అత్యానందమున్ చెంది ఆ
ఘన సౌధాద్భుత రూప దర్శనము భాగ్యంబంచు నుప్పొంగుడున్
జనియించెన్ మది ఖండ కావ్య రచనా సంకల్ప మత్యాదృతిన్

అటుల నేను తలచినంతలో నెదలోన
ఆ చరిత్రమెల్ల గోచరించె
సాగె నా కలమ్ము చకచకా కథలోని
సారమిదియె వినుడు సారమతులు

భరత దేశాన నుత్తర ప్రాంతమందు
చారుతర యమునా నదీ తీరమందు
మొగలు చక్రవర్తుల ముఖ్య పురవరమ్ము
నైపరగు వైభవముల నాగ్రాపురమ్ము

ఆ పురి నేలుచుండును జహంగిరు పుత్రుడు షాజహను ధా
త్రీపతి సర్వ సన్నుత సుధీమతి దోర్బల శౌర్య ధైర్య సం
దీపిత రమ్య కీర్తి శశి దీప్తి సమాన మనోహర స్ఫురత్
రూప సమన్వితుండు రిపులోక భయంకరుడై వెలుంగుచున్

సర్వ సద్గుణ శీలవంతుడు సచ్చరిత్రుడు షాజహాన్
సార్వభౌముడు భారతావని సన్మనమ్మున నేలుచున్
సర్వలక్షణ లక్షితన్ మనసా వరించి సతీమణిన్
స్వర్విశేష సుఖాల దేలెను భవ్యయౌ ముమతాజుతో

ఆ రాచజంట చెలగె న
పార ప్రేమాభిరామ భావోన్నతి సం
సారమ్మెంతయును సుధా

సారమ్మై మ్మ తనర పెక్కు సంవత్సరముల్

సుందర సుమవనముల కను
విందగు సౌధములయందు వేడుక లెన్నో
పొందిరి వారెంతయు పెం
పొందిరి ఆదర్శ భవ్య యుగమను కీర్తిన్

ఆమెను వీడుచున్ నిముసమైనను నిల్వడు షాజహాను నా
భామయు వీడియుండదట ప్రాణవిభున్ స్మరమందిరాలలో
ప్రేమ విలాస డోలికల వేడుకలొందుచు నా సతీపతుల్
భూమి చెలంగిరంట మును పోలుచు చిల్కలు గోరువంకలన్

హద్దులు లేని ప్రేమహృదయాబ్జములందున పొంగుచుండగా
ముద్దుల తేలుచున్ వలపు ముచ్చటలందున నోలలాడుచున్
తద్దయు రాగరంజిత మనమ్ముల పారము నందుచుండి ర
య్యిద్దరె మేలుజంట యన సెంతయు నొప్పుచు సౌఖ్య వార్ధికిన్

ఎంత వారికేని యిక్కట్లు తప్పవు
ఉండబోవు రోజు లొక్కరీతి
అనగ నొక్కనాటి కా మిథునమ్మున
కాంత కనులు మూసె కాంతి బాసె

రాజ నిభాననమ్ము, రతిరాజ మనోహర రూపదీప్తి, అం
భోజ దళాయ తాక్షియుగమున్ దనరారు మనోజ్ఞమూర్తి ముం
తాజు వధూలలామ రసతత్పరయై ప్రణయాబ్ధి తేల్చు నా
రోజులు పోవగా మిగిలె రోదన వేదన షాజహానులో

అనుపమ రూప వైభవము హంస వధూ సమ మందయానమున్
కనక లతాభ కాంతిమయ కమ్ర తనూ విభవాతిరేకమున్
వినయ వినమ్ర భావములు ప్రేమరసమ్మును నింపు డెందమున్
దనరెడు ప్రేమమూర్తి ముమతాజె మనమ్మున నిల్చు వానికిన్

సంతత మా సఖీ హృదయ సౌధమునన్ విహరించు షాజహాన్
స్వాంతము మూగవోవ విరహానల కీలల కోర్వలేక వి
శ్రాంతియు శాంతి గోరుచును సర్వ విషాదములన్ హరించు నే
కాంత వనాన హర్మ్య రచనార్థము నానతి నిచ్చునంతలో

ఎంచిన చంద్రకాంత శిలలెంతయొ దూరము నుండి చాల తె
ప్పించిరి శిల్పకారులను పేరు గడించిన వారలన్ నియో
గించిరి వాస్తు శాస్త్రమునకే తలమానికమైన రీతి ని

ర్మించిరి సౌధరాజము బళీ! కలితాద్భుతరాజి రాజిలన్

ఎందరొ వాస్తుకారులు, మరెందరొ శిల్పకళా ప్రవీణులు లిం
కెందరొ యంత్రకారులును, సెందరొ సెందరొ కూలి వాళ్ళు నా
సుందర హర్మ్యరాజము వసుంధర కొక్క విభూషగా పెలుం
గొందగ రేబవళ్ళు శ్రమనొందుచు కట్టిరి ప్రౌఢ దీక్షతో

శాంతము ప్రేమయున్ వినయ సంపద మంజుల భాషణమ్ము న
త్యంత మనోహరాకృతియు ఆ సతి భూషణరాజి యౌట తత్
కాంతుడు షాజహాన్ నృపతి కల్పన చేసెను హర్మ్యరాజ మా
ప్రాంతమునందు శాంత ముఖ లక్షణముల్ పెలుగొంద నిత్యమున్

చంద్రకాంత హర్మ్య సౌందర్య విభవాన
సుమవనాల తావి సొంపులందు
చంద్రకాంతి చిమ్ము చల్లదనములోన
కాంచు షాజహను కాంతసిరులు

అచ్చటి తోటలందు తిరుగాడెడు చిల్కలు గోరువంకలున్
ముచ్చటలందు దేలుచు ప్రమోదమునొందుచు కైతలల్లు నా
పచ్చని రాచజంట ఎడబాయక యొండురులన్ సమాదృతిన్
నిచ్చలు జీవితమ్ముల వినిర్మల వృత్తి సుఖాబ్ధి తేలుటన్

చందమామ మించు నందాల రాశిగా
తాజమహలు యమున దరిని గాంచి
గగన గమనులైన గంధర్వ దంపతు
లచట తిరుగుచుందు రబ్బురమున

తాజమహలు గాంచి రాజమరాళాలు
అద్భుతమగు తేజమలరు చుండ
సత్యపురమటంచు సంభ్రమించుచు దిగి
సంశయమ్ము తీర చనుచునుండు

పామరులకేని ఆ హర్మ్య వైభవమ్ము
కాంచినంతసె ఉప్పొంగు కైతలెదల
సరస కవితా విలాస భాసురమతులకు
కలుగు ననుభూతి వర్ణింప నలవి యగునె?

ఆ మహాద్భుత సందర్శనాభిలాష
దేశదేశాల జనులేగు దెంతు రటకు
ఆ నయన పర్వ భాగ్యమ్ము ననుభవించి

మురిసి రాగోరు చుందురు మరల మరల

వివిధ దేశాల నుండియు వేడ్కమీర
ఎందరెందరో యాత్రికు లేగుదెంచు
కారణమ్మున నెపుడు నాగ్రాపురమ్ము
ప్రథిత యాత్రాస్థలమ్మున పరగుచుండె

యాత్రికుల కుపయోగింప నట వనరులు
కలవనేక కళాఖండ కలితములయి
వివిధ వృత్తుల వారి జీవికలకెల్ల
ఆలవాలమ్ము ఆగ్రా మహానగరము

అంచిత కీర్తిమంతు డగునట్టి మహాపురుషుండు ప్రేముడిన్
పంచి హితమ్ము గూర్చి జనబాంధవుడై యలరారుచుండ నా
పంచనె చేరి ఎందరొ శుభస్థితి నొంది సుఖింతురుర్వి ని
ట్లెంచగ తాజ్మహల్ భవనమే గతి అచ్చటి వారికెంతయున్

సమ్మతము

మతము లెల్లరిలో పెంచు మంచితనము
మంచితనమున గలుగు సమాజహితము
శాంతి సౌభాగ్యములు నిండు జగతిసెల్ల
భూతలమ్మును స్వర్గపురీతి నలరు

జ్ఞాన సారమ్మును గ్రహించి సన్మనమున
సకల మత సామరస్యమ్మె సమ్మతమని
ఎల్ల మతముల వారును హితమె గోరి
ఆదరమున మెలగుట సమంచితంబు

సంఘ విద్రోహ చర్యలు సలుపువారు
కారణము లేక కొందరు కలుష మతులు
మత విభేదాల రేపి సమాజమందు
నేతలై ఎక్క సెంతురు నిచ్చెనలను

దుష్ట శక్తుల సెల్లను ద్రుంచవలెను
ప్రేమయును సామరస్యమ్ము పెంచవలెను
మేలయిన ధర్మపథము నిర్మించవలెను
విశ్వమొక కుటుంబముగ జీవించవలెను

మధ్య తరగతి

ఎన్నెన్నొ సంపదలున్నవారు ముదాన
భోగభాగ్యాలతో తూగుచుండ
బడుగు వారల గూర్చి ప్రభుత ప్రణాలికల్
మెండుగా గూర్చి లాలించుచుండ
అల్ప సంఖ్యాక వర్గాళికి సర్కారు
చేయూత నిచ్చి పోషించుచుండ
జులుము చలాయింప గలవారు బలిమితో
కోకొల్లలుగ సిరుల్ కూర్చు చుండ
స్వీయ శక్తిపై నిలిచి రాజీకి పెరచి
పెక్కు లిక్కట్లు పడుచు జీవించుచుండు
మధ్య తరగతి గోడులే మాత్రమేని
తలచు నాథుడు లేడు భూతలమునందు

కృతజ్ఞత

పాఠ్యాంశములలోని పద్యాలు కంఠస్థ
        ములుగాగ డెందము ప్పొంగి నపుడు
పద్యాల నల్లుట బాగున్నదని యొజ్జ
        బడిలోన ప్రోత్సాహ పరచినపుడు
కవిరాజు రావూరి అవధాన విద్యలో
        మెళకువల్ నేర్పించి మెచ్చినపుడు
బలె చతుర్విధ కవిత్వములందు కృషి చేత
        అందరి మన్నన లందినపుడు
నీదు వాత్సల్య మహిమగా నే నెరింగి
మది కృతజ్ఞత మెరయ నీ పద సరోజ
యుగళికిన్ మ్రొక్కులిడి పొంగుచుందు నమ్మ!
కళలకుం దల్లి బుధలోక కల్పవల్లి!

--:000:--